


- కమీషన్లు రావని కంప్యూటరీకరణను సాగనివ్వని వైసీపీ నాయకులు
- సహకార సంఘాల కంప్యూటరీకరణకు దీర్ఘకాలిక గ్రహణం
- కేంద్రం నిధులిచ్చినా ముందుకు సాగని పనులు
- సమా వేశాలు, శిక్షణలకే పరిమితం

కంప్యూటరీకరణ పూర్తి చేస్తాం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. రైతులకు వీటి ద్వారా రుణాల మంజూరుతో పాటు వారు చెల్లించిన రుణబకాయిలు సక్రమంగా బ్యాంకులకు జమ చేసేందుకు కంప్యూటరీకరణ అనుసంధాన ప్రక్రియను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయి. ఈ మేరకు నిధులు కూడా కేటాయించారు. ప్రస్తుతం కంప్యూటీకరణ పనులు వివిధ స్థాయిల్లో జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం పూర్తయితే.. రైతులకు మేలు జరగడంతోపాటు అక్రమాలకు తావుండదు. - రామాంజనేయులు, సీఈవో

దేన్నయినా అడ్డుకుంటాం

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 12:

రైతులకు ఇచ్చే రుణాలు సక్రమంగా వారికి చేరడం లేదు. రాజకీయ నాయకులు, సహకార సంఘాల సీఈవోలు రుణాల సాకుతో రైతుల నుంచి వసూళ్లకు అలవాటుపడ్డారు. ఇందుకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను కంప్యూటరీకరించాలని భావించింది. తద్వారా జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతోపాటు బ్యాంకు బ్రాంచ్‌లు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను అనుసంధానం చేయాలని అనుకుంది. దీని వల్ల తమ ప్రయోజనం దెబ్బతింటుందని ఐదేళ్లయినా వైసీపీ నాయకులు కంప్యూటరీకరణను ముందుకు పోనివ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి.

రాష్ట్రంలో రైతులకు ఎంతో ఉపయోగపడే కంప్యూటరీకరణ ప్రక్రియ ఐదేళ్లు పూర్తి కావస్తున్నా నత్తనడకన సాగుతోంది. కంప్యూటరీకరణ అనుసంధానానికి సహకార సంఘాల సీఈవోలు, ఇతర సిబ్బందితోపాటు సహకార బ్యాంకు అధికారులతో జిల్లా సహకార శాఖ అధికార యంత్రాంగం శిక్షణా సమావేశాలకే పరిమితమవుతున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. మరోవైపు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కంప్యూటరీకరణ, బ్యాంకు సంఘాల మధ్య అనుసంధాన ప్రక్రియ పూర్తయితే.. అక్రమాలకు ఎటువంటి అవకాశం ఉండదని, తమ ప్రమేయం పూర్తిగా తగ్గిపోనుందని అధికార పార్టీ నాయకులు కొందరు ఆందోళన చెందుతున్నారు. అందువల్లనే ఈ కార్యక్రమం వేగంగా ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సహకార సంఘాల్లో ఈ ప్రక్రియ పూర్తి కాకపోవడానికి వేరే అడ్డంకులు పెద్దగా లేకపోయినప్పటికీ నాయకులు సంఘాల్లోని సీఈవోలు శ్రద్ధ చూపకపోవడమే కారణమని రైతులు చెబుతున్నారు. అందువల్లనే ఏటా రూ. వందల కోట్ల రుణాల మంజూరుకు సంబంధించి రైతులు చెల్లించిన రుణ బకాయిలు సక్రమంగా బ్యాంకులకు జమ కాకపోవడానికి మధ్యలోనే స్వాహా అయ్యేలా యథేచ్ఛగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.

ఐదేళ్లయినా పూర్తి కాని కంప్యూటరీకరణ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంట సాగు కోసం రైతులకు పంట రుణాలను అదే విధంగా పొలాల అభివృద్ధికి జీవనోపాధిని మెరుగు పరుచుకునేందు కోసం దాదాపు రూ.100 నుంచి 200 కోట్ల దాకా రుణాలను మంజూరు చేస్తూ వస్తోంది. కర్షకజ్యోతితో పాటు వివిధ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చి వాటి ద్వారా రుణాలను రైతులకు అందిస్తున్నారు. అయితే.. ఈ రుణ మంజూరుతో పాటు రుణబకాయిలు రైతులకు సక్రమంగా అందించడంలో రైతుల నుంచి వసూలయ్యే రుణబకాయిలను బ్యాంకులకు అందించడంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని అధికారులు పాలకపక్షం తమ చేతి వాటం చూపుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పత్తికొండ, ఆదోని, డోన్, పాణ్యం, ఆలూరు, బనగానపల్లి, నంద్యాల, ఆత్మకూరు ఆదోని తదితర సహకార బ్యాంకు బ్రాంచీల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో రైతుల రుణ మంజూరుతో పాటు వారు చెల్లించిన రుణ బకాయిలను సక్రమంగా బ్యాంకులకు జమ చేయడంలో ఎన్నెన్నో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లే విషయంలో వివిధ స్థాయిల్లో అశ్రద్ధ చూపుతున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ అక్రమాలను అరికట్టేందు కోసమని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి చేసి సహకార బ్యాంకులకు సంఘాల మధ్య అనుసంధాన ప్రక్రియ చేపట్టాలనే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు రూ.2,500 కోట్లు కేటాయించింది. ఇప్పటికే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని సంఘాలకు కంప్యూటర్లు, ఇతర పరికరాలను సమకూర్చారు. అత్యవసరమైన అనుసంధానం, కంప్యూటీకరణకు మాత్రం సహకార శాఖ బ్యాంకు పాలకవర్గాలు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల పంపిణీ చుట్టూ అనేక వివాదాలు, విమర్శలు ఉన్నాయి. రుణాలు మంజూరైనందుకు రైతుల నుంచి రాజకీయ నాయకులు, సహకార సంఘాల సీఈవోలు కమిషన్లు గుంజుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి చేసి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, దాని బ్రాంచీలను, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను అనుసంధానం చేయాలని అనుకుంది దీనికి రూ.2,500 కోట్లను మంజూరు చేసింది.

మోకాలడ్డుతున్న నేతలు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల రుణాల మంజూరులో, బకాయిల వసూలులో అక్రమాలను నివారించాలని చేపట్టిన కంప్యూటరీకరణ ముందుకు జరగకుండా ఆయా సంఘాల్లోని పాలకవర్గాలు మోకాలడ్డుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. బ్యాంకులు, సహకార సంఘాల మధ్య అనుసంధానం ప్రక్రియ పూర్తయితే.. రుణాల పంపిణీ, బకాయిల వసూలు సక్రమంగా జరుగుతుంది. . దీని వల్ల తమ నోట్లో మట్టి పడుతుందని సహకార సంఘాల పాలకవర్గాలతో పాటు సీఈవోలు, ఇతర సిబ్బంది కంప్యూటరీకరణను వివిధ స్థాయిల్లో అడ్డుకుంటున్నారు.

82 లక్షల పని దినాలు పూర్తి

- ఉపాధి లక్ష్యం 92 లక్షల పని దినాలు
- ఇంకా పెంచే అవకాశం
- డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి



కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 12: జిల్లాలో తీవ్ర కరువు తీవ్రత దృష్ట్యా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రైతులు, రైతు కూలీలకు 92 లక్షల పనిదినాలను కల్పించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించగా.. ఇప్పటికి 82 లక్షల పనిదినాలను కల్పించామని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ కార్యక్రమానికి సంబంధించి లేబర్ కంపోనెంట్ కింద రూ.217 కోట్లు, మెటీరియల్ కంపోనెంటు కింద రూ.98 కోట్లు ఖర్చు చేశామన్నారు. కరువు నివారణకు ప్రభుత్వం మరో రూ.10 లక్షల దాకా పని దినాలను కేటాయించే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది 4,728 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. 2023-24 సంవత్సరంలో పండ్ల తోటల పెంపకాన్ని అభివృద్ధి చేసి రైతులకు ఆర్థిక పరిపుష్టిని చేకూర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. డిసెంబరు 18 నాటికి లేబర్, మెటీరియల్ కాంపోనెంటు కింద రూ.310 కోట్లు ఖర్చు చేశామని, ఇందులో ఉపాధి కూలీలకే రూ.217 కోట్లు చెల్లించామన్నారు. ఇప్పటి దాకా 4,504 కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు కల్పించామని, కరువు ప్రాంతాలుగా ప్రకటించిన మండలాల్లో అదనంగా మరో 50 పనిదినాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గత ఏడాది ఉపాధి పనులకు కేవలం 10వేల మంది కూలీలనే వినియోగించామని, ఈ ఏడాది రోజుకు 65వేల మందికి పని కల్పించాలనే లక్ష్యం కాగా, ప్రస్తుతం 63వేల మంది వరకు ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

ముగిసిన ఇన్‌స్పైర్ మనక్

- అట్టహాసంగా విద్య వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థికి సర్టిఫికెట్ మెమెంటోను అందజేస్తున్న ఏడీ శామ్యూల్ పాల్

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 12: నగరంలోని శ్రీరామ్‌నగర్ శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్ మనక్ సోమవారం అట్టహాసంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 134 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్టుల కింద ఎంపికైన 14 మంది విద్యార్థులకు ఏడీ శామ్యూల్ పాల్ సర్టిఫికెట్లు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని అన్నారు. ఉప విద్యాశాఖ అధికారులు హనుమంతరావు, వెంకట్రామి రెడ్డి, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతతో వివిధ రంగాల్లో సమస్యల పరిష్కారానికి ఆవిష్కరణలు రూపొందించారని అన్నారు. భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విజేతలను జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి జిల్లాలో 1,541 పోస్టులు
- ఎస్జీటీ 1,012, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 529
- కిక్కిరిస్తున్న కోచింగ్ సెంటర్లు



కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 12: ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఊరట కలిగింది. డీఎస్సీ-24 ప్రిపరేషన్‌కు అతి తక్కువ సమయం ఉండటంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ముందు మెగా డీఎస్సీని ప్రకటిస్తామని చెప్పిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి తక్కువ పోస్టులతో డీఎస్సీ ప్రకటించడంతో తమను దగా చేసిందనే నిరుద్యోగులు విమర్శిస్తున్నారు. ఈ దగా డీఎస్సీని రద్దు చేసి మెగా డీఎస్సీని ప్రకటించాలని ఉపాధ్యాయ విద్యార్థి యువజన నిరుద్యోగుల సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. మరో వైపు డీఎస్సీకి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. కొంత కాలంగా నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,541 పోస్టులు:

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,541 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో 1,012 ఎస్జీటీ పోస్టులు కాగా, మిగతా కేటగిరీల్లో స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు 529 ఉన్నాయి.

'టెట్'కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

టెట్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వచ్చిపడుతున్నాయి. ఫిబ్రవరి 18వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు వీలుంది. 19వ తేదీన ఆన్‌లైన్ మాక్ టెస్టు అందుబాటులోకి వస్తుంది. ఫిబ్రవరి 23వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు టెట్ పరీక్షను నిర్వహిస్తారు. మార్చి 10న ప్రాథమిక కీని విడుదల చేసి.. 11న అభ్యంతరాలను స్వీకరిస్తారు. 13న ఫైనల్ కీని విడుదల చేసి 14న ఫలితాలు ప్రకటిస్తారు.

ప్రారంభమైన డీఎస్సీ ప్రక్రియ

ఫిబ్రవరి 12 నుంచి 21వ తేదీ వరకు డీఎస్సీ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు ఇచ్చారు. ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. మార్చి 5వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ పరీక్ష కొనసాగుతుంది. ఈ పరీక్షలు ప్రతిరోజూ రెండు సెషన్స్‌లో జరుగుతాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష కొనసాగుతుంది. 31న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. ఏప్రిల్ 1న ప్రాథమిక కీ పై అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఏప్రిల్ 7న డీఎస్సీ ఫలితాలను ప్రకటిస్తారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితి 44 ఏళ్లు. రిజర్వు కేటగిరీ అభ్యర్థులకు మరో ఐదేళ్లు సడలింపు ఇచ్చారు. ఆన్‌లైన్ ప్రక్రియలో అభ్యర్థులకు ఏమైనా అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు 95056 19127, 97056 55349 హెల్ప్‌డెస్క్ నెంబర్లను సంప్రదించవచ్చు.

పోలీసు స్పందనకు 76 ఫిర్యాదులు



బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

కర్నూలు, ఫిబ్రవరి 12: జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్పందనకు బాధితుల నుంచి 76 ఫిర్యాదులు వచ్చాయి.

- వీఆర్వో పంచాయతీ సెక్రటరీ గవర్నమెంటు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నెల్లూరుకు చెందిన విజయనిర్మల, ఆమె భర్త సుధాకర్, విజయవాడకు చెందిన గీత ఒక్కొక్కరి నుంచి రూ.6 లక్షల చొప్పున మొత్తం రూ.24 లక్షలు తీసుకుని నకిలీ ఆర్డర్ కాపీ ఇచ్చి మోసం చేశారని ఆస్పరి మండలం ములుగుందంకు చెందిన చిన్న తిక్కయ్య ఫిర్యాదు చేశారు.
- తన పొలాన్ని అన్యాయంగా రిజిస్టర్ చేసుకోవాలని సాగులో ఉన్న జొన్న పంటను కొందరు వ్యక్తులు దొంగలించారని హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన మహేష్ ఫిర్యాదు చేశారు.
- తన ఇంటికి రస్తా లేకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆస్పరి మండలం, ఆస్పరి గ్రామానికి చెందిన షేక్షావలి ఫిర్యాదు చేశారు.
- మామిదాలపాడు గ్రామంలోని లాండ్రీ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు సంతోష్‌నగర్‌కు చెందిన మల్లికార్జున ఫిర్యాదు చేశారు.
- ఆర్మీ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నంద్యాల జిల్లా, ఆత్మకూరుకు చెందిన దుర్గప్రసాద్ రూ.7 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు బాలాజీనగర్‌కు చెందిన తాహేరా, సాజీదా ఫిర్యాదు చేశారు.
- గుర్తు తెలియని వ్యక్తులు తన ఖాతా నుంచి రూ.80వేలు తీసుకుని మోసం చేశారని కర్నూలుకు చెందిన హెబ్సిబా ఫిర్యాదు చేశారు.
- తన కుమారుడు అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు కుమ్మరిగేరికి చెందిన నాగరాజు ఫిర్యాదు చేశారు.

స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు సీఐలు ఉన్నారు.

శిక్షణా తరగతులు పూర్తి చేయండి

కలెక్టర్ డా.జి.సృజన



కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, వీడియో సర్వేలెన్స్ టీమ్, వీడియో వ్యూయింగ్ టీమ్, అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్ టీం, అకౌంటింగ్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి ఈ నెల చివరిలోపు శిక్షణా తరగతులు పూర్తి చేయాలని కలెక్టర్ డా.జి. సృజన రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆమె జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, తదితరులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లకు సంబంధించిన సివిల్ పనులను వెంటనే మొదలు పెట్టాలని రిటర్నింగ్ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు. కుల గణన సర్వేలో కొన్ని కులాల నుంచి వచ్చిన అభ్యంతరాలకు సంబంధించిన జాబితాలను బుధవారం లోపు పంపాలని క్రిష్ణగిరి, మద్దికెర ఎంపీడీవోలను ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌యూ రిజిస్ట్రార్‌గా అంకన్న



బాధ్యతలు తీసుకుంటున్న అంకన్న

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 12: రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. అంకన్న బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలోని రిజిస్ట్రార్ చాంబర్లో బాధ్యతలు తీసుకున్న అనంతరం యూనివర్సిటీలోని అన్ని విభాగాధిపతులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యూనివర్సిటీలో పని తీరును గత రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చాను అడిగి తెలుసుకున్నారు. విభాగాల వారిగా యునివర్సిటీలో వివరాలు సేకరించారు. కడప జిల్లా యోగి వేమన యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ ఇంగ్లీష్ విభాగం ప్రధాన ఆచార్యులుగా కొనసాగుతున్న ఆయనకు రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉన్నత విద్యా మండలి ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రిజిస్ట్రార్‌గా పని చేసిన వెంకట సుందరానంద పుచ్చా పరీక్షల విభాగం డీన్‌గా వెళ్లారు.

తుంగభద్రలో ఇసుకాసురులు



- మూడు రోజులుగా అక్రమంగా ఇసుక తరలింపు
- కోసిగి మండలంలో అక్రమ రవాణా
- పట్టించుకోని పోలీసులు

కోసిగి, ఫిబ్రవరి 12: తుంగభద్ర నదిలో నీరు లేకపోవడంతో నదీతీర గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళనలో ఉన్నప్పటికీ నదిలో నీరు లేదని వైసీపీ నేతలు మాత్రం రెచ్చిపోతున్నారు. తుంగభద్ర నదిని మూడు రోజులుగా ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. 20 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలించి తుంగభద్ర సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక నిల్వలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే.. వైసీపీ నాయకులు మాత్రం ఇసుకదాహంతో రెచ్చిపోతున్నారు. శనివారం నుంచి సాతనూరు గ్రామ సమీపంలోని పులికనుమ పంప్‌హౌస్ దగ్గర తుంగభద్ర నదిలో ఇసుకను తోడేస్తున్నారు. జంపాపురం గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్యనాయకుడు, మండల కాంట్రాక్టరు తన సొంత ట్రాక్టర్లు, లీజు ట్రాక్టర్ల ద్వారా భారీ ఎత్తున తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ తన గ్రామంలో అనుకూలమైన చోట డంపు ఏర్పాటు చేసుకుంటున్నారు. అదేవిధంగా ఐరంగల్, తుమ్మిగనూరు, తుంగభద్ర, ఖగ్గల్లు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు సైతం ట్రాక్టర్ల ద్వారా ఒకే చోట నుంచి జేసీబీ ద్వారా తుంగభద్రలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసినా పోలీసులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. అధికారం మాటున వైసీపీ నాయకులు తుంగభద్ర నదిని అడ్డంగా తవ్వేస్తున్నారు. ఇసుకను నిల్వ చేసి ట్రాక్టర్ల ద్వారా తరలించి లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ పోలీసు అధికారులు అధికార పార్టీ నాయకులకు అండగా ఉండటంతో ఇసుకాసురులు మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాలి.



వైసీపీ నాయకులకు చెందిన ట్రాక్టర్లలో అక్రమంగా తరలుతున్న ఇసుక

సాతనూరు దగ్గర తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అధికార వైసీపీకి చెందిన నాయకుల ట్రాక్టర్లు



సాతనూరు సమీపంలో తుంగభద్ర నదిలో ట్రాక్టర్లు, కూలీలతో అక్రమ ఇసుక సరఫరా చేస్తున్న దృశ్యం

బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారు

మార్చి 8 నుంచి 13 వరకు ఉత్సవాలు



మహా శివరాత్రి ఉత్సవాల లగ్న పత్రికను ఈవోకు అందజేస్తున్న అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ

ఓర్వకల్లు, ఫిబ్రవరి 12: మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 8 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్, ఆలయ చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కాల్వబుగ్గ పుణ్యక్షేత్రంలో ఈవో ప్రసాద్, కాల్వబుగ్గ చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె నరసింహశర్మ మహా శివరాత్రి ముహూర్తాన్ని ఖరారు చేశారు. మార్చి 8 నుంచి 13వ తేదీ వరకు కాల్వబుగ్గలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 8న శుక్రవారం బుగ్గ రామేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు కాల్వ గ్రామం నుంచి కాల్వబుగ్గకు వరకు ప్రయాణం, 9న శనివారం మహాశివరాత్రి కుంకుమార్చన, ధ్వజారోహణం, పగలు బుగ్గ రామేశ్వరస్వామి, భ్రమరాంబదేవికి పంచామృతాభిషేకం, రాత్రి స్వాములవారికి గ్రామాభిషేకం, తెల్లవారితే 10వ తేదీ ఆదివారం 3.35 గంటలకు స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం, అదే రోజు నంది వాహన సేవ వాయిద్యాలతో సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం, అలాగే 11న సోమవారం సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, 12న మంగళవారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం పారువేట, 13న బుధవారం పంచామృతాభిషేకం బుగ్గ రామేశ్వరస్వామి ఉత్సవమూర్తులను కాల్వ గ్రామానికి తిరుగు ప్రయాణం కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. లగ్న పత్రికను స్వామి అమ్మవార్ల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హుశేనాపురం సింగిల్ విండో అధ్యక్షుడు నాగతిరుపాలు, ఎంపీటీసీ నాగిరెడ్డి, ధర్మకర్తలు ఆకుల మహేష్, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత మృతి

కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఘటన



మృతి చెందిన చిరుత

ఆత్మకూరు, ఫిబ్రవరి 12: నల్లమల అడవి సమీపంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ చిరుత మృతి చెందింది. సిద్ధాపురం చెరువు అలుగు దాటిన తర్వాత బైర్లూటి సమీపంలోని కేజీ రోడ్డుపై సుమారు ఏడాది వయస్సు గల ఓ ఆడ చిరుతపులి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు చిరుత కళేబరాన్ని బైర్లూటి వన్యప్రాణి వైద్య చికిత్సా కేంద్రాన్ని తీసుకెళ్లి వెటర్నరీ వైద్యులపై పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశారు. కాగా ఘటనపై నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ బీఎన్ఎన్ మూర్తి, ఆత్మకూరు, మార్కాపురం అటవీ డివిజన్ల డిప్యూటీ డైరెక్టర్లు అలాన్ చోంగ్ టెరాన్, విఘ్నేష్ అప్పావ్ ఆరా తీశారు. నల్లమల అటవీ ప్రాంతంలోని కేజీరోడ్డుపై వాహనాల రద్దీ పెరిగిన నేపథ్యంలో ప్రతి 50మీటర్లకు ఓచోట స్పీడ్‌బ్రేకర్‌ను ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని తగ్గించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు గాను ఎన్‌హెచ్-340సీ అధికారులతో అటవీ అధికారులు చర్చించనున్నట్లు సమాచారం.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 244 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 12: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు సోమవారం 244 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొత్తం 8,818 మందికిగానూ, 8574 మంది హాజరయ్యారు. 244 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన సెషన్స్‌లో 4798 మందికి గానూ 4656 మంది హాజరు కాగా, 142 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్స్‌లో 4020 మందికి గానూ 3918 మంది హాజరు కాగా, 102 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను డీఈసీ కమిటీ సభ్యులు ఆర్ఐవో, డీవీఈవో, స్క్వాడ్ బృందాలు పర్యవేక్షణ చేసినట్లు ఆయన వివరించారు.

టెలికాం సెక్టార్‌లో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న నోముల ప్రసాద్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 12: టెలికాం రంగంలో జరుగుతున్న విప్లవాత్మక అభివృద్ధి వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని రీజనల్ హెడ్ టెలికాం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ రిటైర్డ్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫ్లైట్ లెఫ్టినెంట్ నోముల ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో టెలికాం రంగం, యువత ఉపాధి అవకాశాల అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత వారి నైపుణ్యాలతో దేశ పురోగతికి ఎలా భాగస్వాములు కాగలరో వివరంగా వివరించారు. దేశాభివృద్ధికి చక్కటి బాటలు వేసి ప్రపంచ దేశాల్లో మన దేశానికి కీర్తిప్రతిష్టలు పెంపొందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, ప్రిన్సిపాల్ కేవీ శ్రీనివాసమూర్తి, ఇన్నోవేషన్ కౌన్సిల్ కోఆర్డినేటర్ జయలక్ష్మి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లిక్కర్ మాల్‌లో చోరీ

రూ.5.80 లక్షల నగదు అపహరణ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 12 : నంద్యాల పద్మావతి నగర్‌లో ఉన్న ప్రభుత్వ లిక్కర్ మాల్‌లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. లిక్కర్‌మాల్ రేకుల షెడ్డు కావడంతో షెడ్డుపై నుంచి రేకులు తొలగించి లోపలికి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లోని రూ.5.80లక్షల నగదును దొంగలు అపహరించుకు వెళ్లారు. సోమవారం షాపును తెరిచేందుకు వచ్చిన యాజమాన్యం షాప్ లోపల పై భాగంలో రేకులను తొలగించడాన్ని గమనించారు. క్యాష్‌కౌంటర్ వద్ద క్యాష్ కనబడకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకున్నారు. రెండవ పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని చోరీ తీరును పరిశీలించారు. అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు లోనికి చొరబడి చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో చూసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

వైసీపీ నాయకుడి భార్య దుశ్చర్య

- ఆటోడ్రైవర్‌ను చెప్పుతో కొట్టిన వైనం
- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాధితుడు



చికిత్స పొందుతున్న ఓబులేసు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 12 : నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వెలుపల ప్యాసింజర్లను దింపుతూ ఉన్న ఆటో డ్రైవర్‌ను వైసీపీ నాయకుడి భార్య చెప్పుతో కొట్టడం దుమారం రేపింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. నంద్యాలలోని సాయిబాబా నగర్‌కు చెందిన ఓబులేసు 30 సంవత్సరాలుగా ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వెలుపల రోడ్డు పక్కన ప్యాసింజర్లను దింపేందుకు ఆటో నిలబెట్టాడు. అటుగా కారులో వచ్చిన వైసీపీ నాయకుడు దేరెడ్డి శివనాగిరెడ్డి భార్య శివానందమ్మ శివాలెత్తింది. ట్రాఫిక్ జామ్ కావడంతో ఆటోను పక్కకు తొలగించలేదని కోపంతో ఒక్కసారిగా కారులో నుంచి దిగి ఆటో డ్రైవర్ ఓబులేసును చెప్పుతో కొట్టింది. ఎలాంటి తప్పు చేయని తనను చెప్పుతో కొట్టడంపై ఓబులేసు నిలదీశాడు. దీంతో కాసేపు ఇరువురి మధ్య వాదన చోటుచేసుకుంది. తీవ్ర మనస్తాపానికి గురైన ఆటో డ్రైవర్ ఓబులేసు పురుగుల మందును కొనుగోలు చేసి ఆస్పత్రి ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. ఓబులేసు పరిస్థితి విషమంగా ఉండటంతో పట్టణంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు, సీఐటీయూ జిల్లా నాయకుడు లక్ష్మణ్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు దాడికి పాల్పడిన మహిళ ఇంటి ముందు ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలతో చర్చించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వైసీపీలో అభ్యర్థులే లేరా..?

టీడీపీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 12: కర్నూలులో టీడీపీపై పోటీ చేసేందుకు వైసీపీకి అభ్యర్థులే దొరకడం లేదని నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని 17వ వార్డులో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్‌లో టీడీపీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ సిద్ధమని చెప్పుకుంటున్న వైసీపీ నాయకులు కర్నూలులో తనకు దీటుగా అభ్యర్థిని కూడా బరిలోకి దింపలేకపోతున్నారన్నారు. వైసీపీలో అభ్యర్థి ఎవరున్నా కర్నూలులో గెలిచేది టీడీపీనే అన్నారు. తాము అధికారంలో లేకపోయినా ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మలతారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు నాగరాజు, జనసేన ఇన్‌చార్జి అర్షద్, బాబ్జీ, అనంతరత్నం, చంద్రమోహన్, వినోద్ చౌదరి, ముంతాజ్, మారుతి శర్మ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు,

పాణ్యంలో చోరీ

- 5 తులాల బంగారు, రూ.4 లక్షల నగదు అపహరణ
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

పాణ్యం, ఫిబ్రవరి 12: పాణ్యం బీసీ కాలనీ సమీపంలో ఎస్సార్బీసీ కాలువ పక్కన ఉన్న విశ్రాంత సిపాయి వసంతనాయుడు ఇంట్లో సోమవారం ఉదయం 9 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ జరిగింది. వివరాలివీ.. వసంతనాయుడు కొత్తగా నిర్మించుకున్న ఇంటిలో నివాసముంటున్నారు. సోమవారం ఉదయం నంద్యాలకు దంత వైద్యుని వద్దకు తన సతీమణి వసంతతో పాటు వెళ్లారు. మధ్యాహ్నం 12:20కు తిరిగి ఇంటికి వెళ్లారు. అయితే తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ. 4 లక్షలు నగదు. 5 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఘటన జరిగిన ఇంటిని పరిశీలించారు. ఎస్ఐ అశోక్ ఈ సంఘటనపై మాట్లాడుతూ దొంగతనం సంఘటన తమ దృష్టికి వచ్చిందని, బాధితులను విచారించి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

షర్మిలను విమర్శిస్తే ఊరుకునేది లేదు

డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 12: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను విమర్శిస్తే ఊరుకునేదిలేదని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి షర్మిల చేస్తున్న విస్తృత పర్యటనలతో వైసీపీ నాయకులకు భయం పట్టుకుందన్నారు. ఇటీవల వైసీపీ నాయకుడు కోన రఘుపతి, పలువురు నాయకులు షర్మిలను ఉద్దేశించి చేస్తున్న విమర్శలు నాలుగు గోడల మధ్య ఉండి చేస్తున్నారని, ఇది వారి చేతకానితనానికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు కొన్ని ఉపాధ్యాయ పోస్టులను విడుదల చేసిన సీఎం జగన్ మెగా డీఎస్సీని అంటూ నిరుద్యోగులను మోసగించాడన్నారు. అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు చేసి వారంలో ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తానని జగన్ ఐదేళ్ల క్రితం హామీ ఇచ్చి ఉద్యోగులను మోసగించాడన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి దాదాపు 200 మంది కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకుడు బండి జకరయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు



కేవీఆర్‌లో అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 12: కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 22, 23ల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. సోమవారం క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి చాంబర్లో గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎంసీ సాహిత్య ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సులో పాలస్తీనా, ఇజ్రాయెల్ దేశాల్లో ఎడతెగని సమస్యలు వాటి ప్రభావం మీద రెండు రోజుల సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి విద్యావేత్తలు రానున్నారని, అధ్యాపకులు, విద్యార్థులు ఇందులో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, డాక్టర్ పార్వతి, డాక్టర్ ఇర్ఫాన్, రాధారాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తు : గౌరు చరిత



34వ వార్డు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న గౌరుచరిత

కల్లూరు, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ టీడీపీ అధికారంలోకి రావాలని పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు చరిత పేర్కొన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 19,34 వార్డుల్లో చేపట్టిన 'బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరు చరిత హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ విధానాలకు ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల హామీలను సీఎం జగన్ గాలికొదిలేశారన్నారు. ఉద్యోగులు, మహిళలు, యువత వివక్షతకు గురయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, జిల్లా కోశాధికారి పియూ. మాదన్న, ఎన్‌వి. రామకృష్ణ, దాకేష్‌గౌడ్, సులేమాన్, పెద్దబీచుపల్లి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాలువలో పడి వ్యక్తి మృతి

నందికొట్కూరు ఫిబ్రవరి 12: నందికొట్కూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కేసీ కాలువలో పడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. నందికొట్కూరులోని రజకపేటలో నివాసముంటున్న ఆవుల వెంకటేశ్వర్లు(46) ఆదివారం ఉదయం దుస్తులు శుభ్రం చేసేందుకు బిజినవేముల సమీపంలోని కేసీ కెనాల్‌కు వెళ్లాడు. సాయంత్రం అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బిజినవేముల సమీపంలో కేసీ కాలువలో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పెద్దవెంకటేశ్వర్లు కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

స్పందన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వండి : ఎస్పీ

పోలీస్ స్పందనకు 102 ఫిర్యాదులు



మహిళతో సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 12: పోలీస్ స్పందనలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో ఎక్కువగా సివిల్ తగాదాలు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాలలో మనస్పర్థలు లాంటి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జిల్లా నలుమూలల నుంచి 102 సమస్యలతో కూడిన ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వెలుగోడు మండల రేగడగూడూరు గ్రామానికి చెందిన చాబోలు జాషువా అనే వ్యక్తి ఆయన కుమారులపై ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. తన పొలం బలవంతంగా రిజిస్టర్ చేయించుకొని ఇంట్లో నుంచి వెళ్లి పొమ్మంటున్నారని, అన్నం పెట్టకుండా మద్యం తాగివచ్చి బాధ పెడుతున్నారని.. మీరే న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించాడు. బేతంచెర్లకు చెందిన పాపసాని వెంకటలక్ష్మమ్మ అనే మహిళ తన కుమారుడు ఇంటిని వేరే వాళ్లకు విక్రయించాడని, జీవనానికి అందులో కొంత డబ్బులు ఇప్పించాలని ఎస్పీని వేడుకుంది. మరో ఘటనలో గుంతకల్లుకు చెందిన పి.రవీంద్ర అనే వ్యక్తి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద నుంచి రూ.4 లక్షలు తిరిగి ఇవ్వకుండా వేధిస్తున్నాడని కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామానికి చెందిన షేక్ గైబుషావలి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. స్పందన కార్యక్రమంలో ఎస్పీతోపాటు స్పెషల్‌బ్రాంచ్ సీఐ రవీంద్ర, ఎస్సై హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



హర్షవర్ధన్



సుబ్బరాయుడు(ఫైల్)

కొలిమిగుండ్ల ఫిబ్రవరి 12: కొలిమిగుండ్ల - జమ్మలమడుగు క్రాసింగ్‌లో సోమవారం మధ్యాహ్నం రెండు మోటర్ సైకిళ్ళు ఎదుఎదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మోటరు సైకిలిస్టులు మృతి చెందారు. కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (25) మోటర్ సైకిల్‌పై కొలిమిగుండ్ల నుంచి పెట్రోలు పోయించుకోవడానికి వెళుతుండగా కొలిమిగుండ్లకు చెందిన కుమ్మరి సుబ్బరాయుడు మోటర్ సైకిల్ మీద వస్తూ పెట్రోల్ బంకు సమీపంలో వారి వాహనాలు ఢీకొన్నాయి. హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడు (45)ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కొలిమిగుండ్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలను పరిష్కరించండి: కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 12: స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ ఆదేశించారు. సోమవారం పాతకౌన్సిల్ హాలులో నిర్వహించిన స్పందనలో కమిషనర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా కమి షనర్ మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలకు తప్పకుండా ఎండార్స్‌మెంట్ అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 48వ వార్డు సుంకేసుల రోడ్డులోని పార్కును అభివృద్ధి చేయాలని కాలనీవాసులు ప్రతాప్‌రెడ్డి, రఫి, షరీఫ్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. పార్కులో పిల్లలు ఆడుకోవడానికి పరికరాలు, పెద్దల కోసం జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కులో గడ్డి, చెట్లు పెరుగుతుండటంతో విష సర్పాలు సంచరిస్తున్నాయన్నారు. అలాగే కాలనీల్లో సీసీరోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని, టిడ్కో ఇళ్లు మంజూరు చేయాలని పలువురు కమిషనర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ శశికళ, ఎస్ఈ డి.వేణుగోపాల్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

రేపు ముస్లింల ఆత్మీయ సమ్మేళనం

గూడూరు, ఫిబ్రవరి 12: గూడూరులో బుధవారం నిర్వహించనున్న ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేద్దామని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో గూడూరులోని షాదీఖానాలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమ ఏర్పాట్లను ఆకెపోగు ప్రభాకర్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆకెపోగు మాట్లాడుతూ ఈకార్యక్రమానికి శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, టీడీపీ కర్నూలు అధ్యక్షుడు బీటీ నాయుడు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నన్ బాషా, మదార్ సాహెబ్, సులేమాన్, రవూఫ్, ఇబ్రహీం, చిలక శ్రీను పాల్గొన్నారు.

విజేతకు అభినందన

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 12: స్థానిక సైట్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న వెంకటసుబ్బమ్మ ఆల్ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో సిల్వర్, కాంస్య పతకాలు సాధించడంతో ప్రిన్సిపాల్ వసుంధర దేవి ఆమెను అభినందించారు. సోమవారం కళాశాలలో వెంకటసుబ్బమ్మను ప్రిన్సిపాల్, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హైదరాబాదులో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో వెంకటసుబ్బమ్మ సిల్వర్ మెడల్ 4/400, రిలేలో అండర్-55 విభాగంలో ట్రిపుల్ జంప్‌లో రేస్ అండ్ బ్రౌంజ్ మెడల్ సాధించారన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 12: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఆయాలకు పని ఒత్తిడి తగ్గించాలని ఏడీ శామ్యూల్ పాల్‌కు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు సోమవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో పని చేస్తున్న ఆయాలను జీవో.నెం.22 ప్రకారం శానిటేషన్ వర్క ర్స్‌ను నియమించారన్నారు. ఈ పనులు కాకుండా పాఠశాల అభివృద్ధిలో వారితో ఇతర పనులు చేయిస్తున్నారన్నారు. ఏడీని కలిసిన వారిలో సంఘం నాయకులు జె.లక్ష్మి, మద్దమ్మ, మేరమ్మ, రాజేశ్వరి, సుజాత, సరోజమ్మ ఉన్నారు.

రేపు దామోదరం సంజీవయ్య జయంతి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 12: మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్‌లోని సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ రంగ లక్ష్మీదేవి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'

ఓర్వకల్లు, ఫిబ్రవరి 12: మండలంలోని హుశేనాపురం గ్రామంలో మంగళ వారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు బజారు సోమవారం తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరవుతున్నారన్నారు.

నేడు మారెమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 12: మండలంలోని లద్దగిరిలో మారెమ్మఅవ్వ విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం జరగనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో వేదపం డితుల ఆధ్వర్యంలో హోమం, అభిషేకాది పూజలనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిపించనున్నట్లు తెలిపారు. అలాగే కోట్ల దంపతులచే అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి: ఎస్పీ


విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 12: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. బెంగళూరులోని రాష్ట్రీయ మిలిటరీ స్కూలుకు కర్నూలుకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం కొత్తపేటలోని స్పందన భవనంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎస్పీని కలిశారు. ఆర్ఎంఎస్‌లో 6వ తరగతికి ఎంపికైన వెంకటసాయి చరణ్, సోమశేఖర్, 9వ తరగతికి ఎంపికైన పూజారి చరణ్, వారి తల్లిదండ్రులను ఎస్పీ అభినందించారు. విద్యార్థులు ఎంపిక కావడానికి శిక్షణ ఇచ్చిన కర్నూలు ఎస్‌హెచ్ఎస్ సైనిక్ స్కూల్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ హరిని ఎస్పీ ప్రశంసించారు.

ఎమ్మార్పీఎస్ రాయలసీమ మహిళా అధ్యక్షురాలిగా నాగేశ్వరి


మాట్లాడుతున్న ప్రకాష్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: ఎమ్మార్పీఎస్ రాయలసీమ మహిళా అధ్యక్షురాలిగా అడ్డాకుల నాగేశ్వరి ఎన్నికయ్యారు. సోమవారం అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆర్‌జే ప్రకాష్ హాజరయ్యారు. ముం దుగా ఆయన డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నాగేశ్వరిని నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కిష్టన్న, గంధం శ్రీనివాస్, హుశేన్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. సోమవారం సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్ అధ్యక్షతన సుర్జీత్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజశేఖర్, విజయ్, రామాంజనేయులు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

▸ టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 12: కర్నూలు నగర అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. నగరంలోని శంకరాస్ డిగ్రీ కళాశాలలో కర్నూలు యువగళం పేరుతో యువతతో ఆయన ముఖాముఖీ నిర్వహించారు. యువత భవిష్యత్తు బాగుండాలంటే మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఆయన సూచించారు. టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో తీసుకున్న ఎన్నో మంచి విధానాలు వైసీపీ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. అన్నా క్యాంటీన్ ఎత్తివేసిందని, చెత్తకు పన్ను వేసే విధానం కొత్తగా తీసుకొచ్చిందని, ఇష్టానుసారంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారని మండి పడ్డారు. గాంధీనగర్ సమీపంలోని చిన్న పార్కు వద్ద దుకాణాలు ఎత్తివేశారన్నారు. విద్యార్థులు చదుకునేందుకు స్టడీ హాలు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోని రాగానే ఇప్పుడు అమలవుతున్న విధానాలను ప్రక్షాళన చేసి కొత్త విధానాలు అమల్లోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హరికిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక : నగరంలోని మౌర్యఇన్‌లో టీజీ భరత్ సమక్షంలో 18వ వార్డు జోహరాపురానికి చెందిన మహిళలు, యువకులు టీడీపీ నాయకుడు ఆనంద్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు యువత కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో సతీష్, భరత్, అశోక్, గిరి ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బాబ్జీ పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

● కర్నూలు నగరంలోని 18 వార్డు జోహరాపురానికి చెందిన ముస్లిం యువకులు టీడీపీలో చేరారు. సోమవారం మౌర్యఇన్‌లో టీజీ భత్ యువకులకు కండువా కప్పి ఆహ్వానించారు. టీజీ భరత్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో జోహరాపురం ప్రాంతానికి అత్యధిక నిధులు కేటాయిస్తానని తెలిపారు. ముస్లిం యువకులు పెద్ద ఎత్తున తనకు మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో రఫీక్, రియాజ్, నబీ, ఇమ్రాన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు శ్రీనివాసమూర్తి, జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ నాయకులు మోహన్, మోహబూబ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అనంద్, శాంతమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

'కరువు సహాయక చర్యలు చేపట్టాలి'

ఓర్వకల్లు, ఫిబ్రవరి 12: మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని, రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ, రుణ పరిహారం, రైతుల రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించినా ఇంత వరకు కరువు సహా యక చర్యలు చేపట్టలేదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీలో వర్షాలు లేక 70 శాతం పంటలు పండలేదని, పూర్తిగా దెబ్బతిని ఎండిపోయాయని అన్నారు. రైతులకు అప్పులే మిగిల్చాయని, వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటు న్నారన్నారు. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఎకరాకు రూ.20వేలు ఇవ్వాలని, పంటల భీమా నష్టపరిహారం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రైతులు పంట రుణాలకు రూ.2 లక్షలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నటరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మదుసూదన్, చంద్రబాబు నాయుడు, చాంద్‌బాషా, శ్రీధర్, రామాంజనేయులు, మహేష్, శ్రీరాములు, ఎల్లరాముడు, సుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

జగన్ రెడ్డిని గద్దె దించుదాం


తొలిశాపురంలో బాబు ష్యూరిటీ.. భవిష్యతుకు గ్యారెంటీ కార్యక్రమంలో దస్తగిరి

కర్నూలు(రూరల్), ఫిబ్రవరి12: రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలం, బసవాపురం, తొలిశాపురం గ్రామాల్లో సోమవారం స్థానిక సర్పంచు కురువగిడ్డయ్య, పెద్దమహేష్‌రెడ్డితో కలిసి టీడీపీ ప్రవేశపెట్టిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీపై గ్రామస్తులకు దస్తగిరి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో సర్పంచులకు వారికి రావాల్సిన కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం నొక్కేసిన జగన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బసవాపురం, తొలిశాపురం టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ రామాంజనేయులు, మాజీ సర్పంచు నాగన్న, నడిపి లడ్డు, గూడురు గిడ్డయ్య, బీసీ మద్దిలేటి, రాముడు, సుంకన్న, పెద్దశేషన్న, మద్దిలేటి పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: ఉల్చాల నుంచి రేమట గ్రామానికి చేపట్టిన పెండింగ్ రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని స్పందనలో ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాయలసీమ విద్యార్థి పోరాట సమితి, గ్రామ ప్రజలు, ప్రజాసంఘాల పోరా ట ఫలితంగా గత ఏడాది సెప్టెంబరు 18న ఉల్చాల గ్రామం నుంచి రేమట మీదుగా కొత్తకోట గ్రామానికి రోడ్డు నిర్మాణం పనులు మొదలు పెట్టార న్నారు. ఉల్చాల నుంచి రేమట గ్రామానికి 7 కి.మీలకు గానూ కేవలం 5 కి.మీలు మాత్రమే రోడ్డు నిర్మాణం పూర్తి చేశారన్నారు. మిగిలిన 2 కి.మీల రోడ్డు పూర్తి చేయలేదని తెలిపారు. రాయలసీమ విద్యార్థి పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అశోక్, వసంత్ పాల్గొన్నారు.

హాకీ చాంపియన్‌గా కడప బాలుర జట్టు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 12: స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల ఫైనల్స్‌లో కడప జట్టు 2-1 గోల్స్‌తో అనకాపల్లి జట్టుపై నెగ్గి చాంపియన్‌షిప్‌ను అందుకుంది. కాగా రన్నర్‌గా అనకాపల్లి జట్టు నిలిచింది. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు మూడో స్థానంలో, కర్నూలు జట్టు నాలుగో స్థానం దక్కింది. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బి.రామాంజనేయులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో దాసరి సుధీర్, ప్రవీణ్, థామస్ పీటర్, విశ్వమోహన్ రెడ్డి, వినోద్ జోషి, క్రీడా సంఘాల ప్రతిని ధులు శ్రీనివాసులు, గంగాధర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు తదితరులు

కర్నూలు (అగ్రికల్చర్), ఫిబ్రవరి 12: రైతులకు స్వచ్ఛమైన నీరందించాలనే ఉద్దేశంతో కర్నూలు మార్కెట్ యార్డులో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని మాజీ చైర్‌పర్సన్ ఎన్ శమంతకమణి అన్నారు. ఈ ప్లాంట్‌ను సోమవారం కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శమంతకమణిలు ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ వైస్ ఛైర్మన్ రేణుక, కార్పొరేటర్ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకరరెడ్డి, వైస్ ఛైర్మన్ భీమేశ్వరరెడ్డి, డైరెక్టర్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

పేద వైద్య విద్యార్థికి ఆర్థిక చేయూత


విద్యార్థితో ఉపాధ్యాయుడు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: కడప జిల్లాకు చెందిన వైద్య విద్యార్థి లోకేశ్వర్‌కు జిల్లాకు చెందిన శ్రీబాలాజి సేవా ట్రస్టు గౌరవ సలహాదారుడు ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ధనుంజయరెడ్డి ఆర్థిక చేయూత అందించారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థి అయిన లోకేశ్వర్‌కు ఇంట ర్మీడియట్, మెడిసిన్ సీటు ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం అయ్యే ఖర్చులకు నిధులను సమకూర్చారు. ఈయన పెద్దపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ టీచరుగా పని చేస్తున్నారు

మున్సిపల్ కార్మికుల ధర్నా

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 12: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై తక్షణమే జీవోలు విడుదల చేయాలని ఏపీ మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన మున్సి పల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జనవరిలో కార్మికులు తలపెట్టిన సమ్మె సందర్భంగా మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారుడు సజ్జలరామక్రిష్ణారెడ్డిలు కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. హామీలపై ఇప్పటి వరకు ఎలాంటి జీవోలు విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాణిక్యం, సవారి, దేవసహాయం, జమీల్ పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి

కల్లూరు, ఫిబ్రవరి 12: ఖరీఫ్ సీజన్‌లో కరువుతో పంటలు దెబ్బతిన్న రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు తహసీల్దారు కార్యాలయం ముందు రైతుసంఘం మండల కార్యదర్శి ఏ.క్రిష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కె. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల 25 మండలాల్లో కరువు ఏర్పడిందని ప్రభుత్వం 22 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం సరైంది కాదని అన్నారు. అనంతరం తహసీల్దారు సి. మునివేలుకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి. మధు పాల్గొన్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్‌గా బాశెట్టి లత ఎంపిక



కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రోజ్‌గర్ మేళాలో భాగంగా కర్నూలు కేవీఆర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ బాశెట్టిలత హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయానికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. సోమవారం సెంట్రల్ యూనివర్సిటీకి నియమించిన పత్రాన్ని కేంద్ర మంత్రి మురుగన్ చేతుల మీదుగా హైదరాబాదు నిసా కేంద్రంలో బాశెట్టిలత అందుకున్నారు. 2011 నుంచి బాశెట్టిలత తెలుగు అధ్యాపకురాలిగా ఆత్మకూరు ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో పని చేసి బదిలీపై కర్నూలు కేవీఆర్ కళాశాలకు వచ్చారు. రచయితగా నాలుగు ముద్రిత గ్రంథాలు, 10 ముద్రిత వ్యాసాలు జాతీయ స్థాయి సెమినార్‌లలో, 10 అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమయ్యాయి. పరిశోధనాపత్ర సమర్పణలు జాతీయ స్థాయిలో 17, అంతర్జాతీయ స్థాయిలో 6 ప్రచురించారు. 2022లో నేషనల్ బెస్ట్ ఉమెన్ ఫ్యాకల్టీ అవార్డును అందుకున్నారు. సెంట్రల్ యూనివర్సిటీకి ఎంపికైన ఆమెను ముద్రిక కళాసంస్థ అధ్యక్షుడు భాస్కర్, సాహితి స్రవంతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్‌లు అభినందించారు.

15న ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 12: సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి 15న నగరానికి వస్తున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు జిల్లా కార్యదర్శి బిగిడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సుధాకర్‌రెడ్డికి ఉమ్మడి జిల్లాతో ఎనలేని అనుబంధం ఉందన్నారు. ఆత్మీయ సమ్మేళానికి వామపక్ష ఉద్యమ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 12: స్థానిక 46వ వార్డులో రూ.80 లక్షలతో నిర్మించిన కాలువలతోపాటు పలు కాలనీలలో పూర్తయిన అభివృద్ధి పనుల ను మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, స్టాండింగ్ కమిటీ సభ్యుడు నగరూరు శ్రీనివాసరావు, ఎంఈ షాకీర్, డీఈఈ నరేష్, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్ రెడ్డి అరాచకాలపై లోకేశ్ శంఖారావం


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 12: జగన్‌మోహన్ రెడ్డి అరాచకాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ నెల 11 నుంచి శంఖారావం చేపట్టనున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం పాదయాత్రలో పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమంతో పర్యటిస్తారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన ధరలతో ప్రజలు, ఉద్యోగాలు లేక యువత ఇబ్బం దులు పడుతున్నారన్నారు. పార్లమెంట్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి పేర పోగు రాజు, కోడుమూరు తెలుగు యువత అధ్యక్షుడు ఆదిత్యరెడ్డి, ప్రొఫెషనల్ వింగ్ పార్లమెంట్ అధ్యక్షుడు భరత్ పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

▸ కేఈ ప్రభాకర్ కుటుంబ సభ్యులు పూజలు


కేఈ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 12: నగరంలోని సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం స్వామి, అమ్మవార్లకు ఉదయం సుప్రభాత సేవ, రుద్ర హోమం, దృష్టి దుర్గా హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి, టీడీపీ నేత కేఈ ప్రభాకర్, ఆయన కుటుంబ సభ్యులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కళ్లే చంద్రశేఖర్ కేఈ ప్రభాకర్‌ను శాలువ కప్పి, సత్కరించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కళ్లే చంద్రశేఖరశర్మ, హెచ్‌కే రాజశేఖర్‌రావు, గౌరవ సలహాదారుడు హెచ్‌కే మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని ఆక్రమించారని ఫిర్యాదు


అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కోడుమూరు (రూరల్), ఫిబ్రవరి 12: గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించారని స్పందనలో కొత్తూరు వాసులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఉసేని, నడిపి గోకారి, చిన్నగోకారి మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం తమ తల్లి నాగమ్మ పేర ప్రభుత్వం 2సెంట్ల నివాస స్థలం కేటాయించిందని, అయితే ఇటీవల ఓ వ్యక్తి స్థలాన్ని ఆక్రమించారని తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దార్ గుర్రప్ప మాట్లాడుతూ విచారించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బైనదొడ్డి గ్రామానికి చెందిన రైతు రాముడు తన పొలం ఆన్‌లైన్ కాలేదని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ రద్దు చేయాలి: యూటీఎఫ్


డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అప్రెంటిస్‌షిప్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను ఉపాధ్యాయులు దహనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటిల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించకపోగా.. కొత్త సమస్యలను సృష్టిస్తున్నారన్నారు. విడుదలైన డీఎస్సీలో సుదీర్ఘకాలంగా అనేక పోరాటాలు చేసి రద్దు చేసుకున్న అప్రెంటిస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరింప చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయడం శోచనీయమన్నారు. అప్రెంటిస్‌షిప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి, తిమ్మన్న, సోమన్న, హనుమన్న, రాముడు, మోహన్, నారాయణ రెడ్డి, ఇబ్రహీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురు రోగులకు అరుదైన వైద్యం

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 12: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ముగ్గురు రోగులకు వైద్యులు అరుదైన వైద్య సేవలందించారు. ఇందులోభాగంగానే సర్జికల్ విభాగంలో వైద్యులు రెండు అరుదైన ఆపరేషన్లు, ఓ వృద్ధుని మేజర్ చికిత్స నిర్వహించారు. ముగ్గురు రోగులు సోమవారం డిశ్చార్జ్ కావడంతో ఆ వివరాలను సర్జరీ విభాగపు ప్రొఫెసర్ డా.మాధవి శ్యామల సోమవారం వెల్లడించారు. కల్లూరు మండలం పర్లకు చెందిన 35 ఏళ్ల సువర్ణకు లివర్‌లో రక్తం గడ్డ కట్టడంతో అడ్మిట్ అయింది. ఏదైనా గాయమైతే రక్తం ఆగేది కాదు. దీన్ని వైద్య పరిభాషలో లివర్ హిమాంజియోమో అంటారు. రేడియాలజీ హెచ్‌వోడీ రాధారాణి, ఇంటర్నేషనల్ రేడియాలజిస్టు అరుణ్ సహకారంతో ధమని ద్వారా కాలేయంలోని హిమాంజియోముగా రక్తం గడ్డలోకి మందును పంపించారు. దీంతో రోగి ఈ చికిత్స తర్వాత కోలుకున్నారు. రెండో కేసు రాజోలికి చెందిన 17 ఏళ్ల శిల్పలత ప్లీహం పెద్దదిగా అయి రక్తహీనతతో బాధపడుతూ ఆసుపత్రి సర్జరీ యూనిట్ ఆరులో చేరింది. రోగికి ప్లీనెక్టమి ఆపరేషన్ నిర్వహించగా హెచ్‌బీ శాతం అనూహ్యంగా పెరిగింది. పుట్టపర్తికి చెందిన 88 ఏళ్ల నాగప్పకు పేగులు కిందకు జారడంతో ఆసుపత్రిలో చేరారు. అతనికి ఆపరేషన్ చేయకుండా మలం ద్వారం ద్వారా సమస్యను పరిష్కరించారు. ఈ ఆపరేషన్‌లో సర్జరీ-6 యూనిట్ అసోసియేట్ ప్రొఫెసర్ జయరాం అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రారెడ్డి, శృతి, సృజన్, అనస్తీషియం ప్రొఫెసర్ కొండారెడ్డి, అసిస్టెంట్లు సుధీర్, మహేష్, పీజీ వైద్య విద్యార్థులు శాంతి స్వరూప్, చిన్ని పాల్గొన్నారు.

అభ్యంతరాలను పరిష్కరించాలి

కల్లూరు, ఫిబ్రవరి 12: ఓటరు నమోదు కోసం ప్రజలను వచ్చే అభ్యంతరాలను త్వరగా పరిష్కరించాలని కల్లూరు తహసీల్దారు సి.మునివేలు బీఎల్ఓలను ఆదేశించారు. సోమవారం కల్లూరు తహసీల్దారు కార్యాల యంలో బీఎల్‌లకు ఆయన అవగాహన కల్పించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల నుంచి ఫారం-6,7,8 వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళిని ప్రకారం బీఎల్ఓలు విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేం ద్రాల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాణ్యం ఎలక్షన్ డీటీ అనూరాధ, ఆర్ఐ రాజేంద్రబాబు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఘనంగా 1104 యూనియన్ వార్షికోత్సవం

కల్లూరు, ఫిబ్రవరి 12: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్(1104) వార్షికోత్సవాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.క్రిష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం విద్యుత్‌శాఖ 132 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆయన 1104 జెండాను ఆవిష్కరించారు. అనంతరం మోగా రక్తదాన, ఉచిత వైద్యశిబిరాలను ముఖ్యఅతిథులు ఎస్ఈలు ఎం.ఉమాపతి, కేవీ.రామకృష్ణ, సీహెచ్.రాఘవులు, డీవీ.కృష్ణకుమార్, బీ.నాగరాజు, ఎం.శివకుమార్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎన్ క్రిష్ణయ్య మాట్లాడుతూ విద్యుత్ ఉద్యో గులు, కార్మికులు, ఒప్పంద ఉద్యోగుల సమస్యల కోసం అనేక పోరా టాలు చేసిన యూనియన్ 1104 అని అన్నారు. కార్యక్రమంలో వై.భాస్క రరావు, బిఎన్.గణేష్, తిరుమలయ్య, విజయేంద్రచారి, మహేశ్వరరెడ్డి యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 12: స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల బాస్కెట్‌బాల్ పోటీలను సోమవారం కర్నూలు నగర ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, సీఈవో రమణ, 50వ వార్డు కౌన్సిలర్ షేక్ అహ్మద్, బాస్కెట్‌బాల్ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఉలిందకొండలో అమ్మవార్ల దేవర

కల్లూరు, ఫిబ్రవరి 12: మండలంలోని ఉలిందకొండ గ్రామంలో ఈ నెల 13, 14 తేదీల్లో పెద్దమ్మ, సుంకులమ్మ, కర్రెమ్మ, మారెమ్మ అమ్మవార్ల దేవర నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ వేడుకలను గ్రామస్థులంతా కలిసికట్టుగా నిర్వహించుకోవాలని సూచించారు. వేడుకల్లో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని గ్రామపెద్దలు తెలిపారు.

మాలలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ఆలూరు, ఫిబ్రవరి 12: మాల సామాజికవర్గానికి అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్అండ్బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలూరు తాలుకాలో దళితులకు సరైన గుర్తింపు లేదని, వివిధ రాజకీయ పార్టీల దళితులను ఓటు బ్యాంకుగా చూస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భరత్, వెంకటరాముడు, గాదిలింగప్ప, బసవరాజు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల నిరసన

ఆదోని టౌన్, ఫిబ్రవరి 12: మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వెంటనే జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, సోమవారం మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 17వ వార్డు సచివాలయం ఎదురుగా నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు అజయ్ బాబు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ కార్మికులు ఇటీవల చేపట్టిన సమ్మె కాలానికి రావాల్సిన జీతాలు, ఇతర అలవెన్స్‌లను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి బీ వెంకన్న, సహాయ కార్యదర్శి బీ గోవిందు, మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే జయరాజ్, శాంత పాల్గొన్నారు.

కోట్ల సుజాతమ్మతోనే ఆలూరు అభివృద్ధి

ఆస్పరి, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో ఎంతో వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం అభివృద్ధి టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మతోనే సాధ్యమని ఆస్పరి మాజీ ఎంపీపీ రత్నమ్మ, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణయాదవ్ అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో నియోజకవర్గ పరిస్థితులను చర్చించి, వేదావతి ప్రాజెక్టు ఆలూరు నియోజకవర్గంలో మంజూరు చేయించిన ఘనత సుజాతమ్మదేనని స్పష్టం చేశారు. ప్రస్తుత వైసీపీ మంత్రి ఉన్నా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, కనీసం వేదావతి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేకపోయారని విమర్శించారు. సమావేశంలో మాజీ మండల కన్వీనర్ ఎస్ తిమ్మన్న, వార్డు మెంబర్ వీరేష్, అంబయ్య, యాగంటి రాఘవేంద్ర పాల్గొన్నారు.

నీటి కేటాయింపుపై కేంద్రం పెత్తనం తగదు : గడ్డం

నందవరం, ఫిబ్రవరి 12: తెలుగు రాష్ట్రాల నీటి కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం తగదని ఎల్ఎల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలో నీటి కేటాయింపు రాష్ట్రలకు వదిలి కేవలం తెలుగు ప్రాంతాల్లో మాత్రం నీటి కేటాయింపును కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉంచుకోవడం ఎమిటని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ కేంద్ర మంత్రి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, తిక్కారెడ్డి చంద్రబాబుతో మాట్లాడి ప్రాజెక్టుల అనుమతుల సాధించి సర్వేలు చేయడం జరిగిందని గుర్తు చేశారు.

ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి: మాజీ ఎమ్మెల్యే


పూజలు చేస్తున్న జయనాగేశ్వరరెడ్డి

నందవరం, ఫిబ్రవరి 12: ప్రజలంతా ఆయూరారోగ్యలతో ఉండాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలోని పాత చేనేత కాలనీలో పురాతన శివాలయంలో శివస్వాములతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు, వైస్ ఎంపీపీ కనకవీడు రఘుమూర్తి స్వామి, మాజీ జెడ్పీటీసీ ఈరన్నగౌడు, రైస్‌మిల్ నారాయణరెడ్డి కాశీంవలీ, ధర్మాపురం గోపాల్, మాజీ సర్పంచ్ ఈరన్న, జబ్బార్, వహబ్, సలీం పాల్గొన్నారు.

త్రిలింగేశ్వర ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

కౌతాళం, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన త్రిలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వివిధ మఠాలు (హచ్చోళ్ళి, హల్వి, మేళిగనూరు, రౌడుకుంది) మఠాధిపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఇప్పటికే నూతన దేవాలయ నిర్మాణం పూర్తి కావడంతో ఈ నెల 11 నుంచి 22వ తేదీ వరకు దేవాలయంలో ప్రతిరోజూ రాత్రి పురాణ ప్రవచనాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హల్వి మఠం పీఠాధిపతి శ్రీమహంతేశ్వర స్వామి మాట్లాడారు. మహిళలు కలశాలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు.

బొమ్మిరెడ్డిపల్లెలో బండలాగుడు పోటీలు

వెల్దుర్తి, ఫిబ్రవరి 12 : మండలంలో బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో పామయ్యతాత తిరుణాల పురస్కరించుకొని సీనియర్ కేటగిరి బండలాగుడు పోటీలు సర్పంచి సునీతమధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మండల కన్వీనర్ రవిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. పోటీలలో 15 జతలు పాల్గొన్నాయి. పి.ఆర్.మెమోరియల్ కుంచెనపల్లి గ్రామానికి చెందిన ఎద్దులు 2301 అడుగులు లాగి మొదటి విజేతగా నిలిచాయి.

బీవీ గెలవాలని 101 టెంకాయల సమర్పణ

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 12: రానున్న ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి విజయం సాధించాలని కోరుతూ కడిమెట్ల గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు 101 టెంకాయలు కొట్టారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సొంతగ్రామమైన కడిమెట్లలో టీడీపీ గ్రామ కమిటి అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి తెలుగు యువత నాయకులు చంద్ర, రవి, షేకన్నలతో పాటు గ్రామ నాయకులు 101 టెంకాయలు కొట్టి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

కన్నుల పండువగా నీలకంఠేశ్వరుని కల్యాణం

గోనెగండ్ల, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలోని పార్వతి, నీలకంఠేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. అనంతరం ఉమామహేశ్వరగౌరి వ్రతం చేశారు. దేవాలయ తొమ్మిదవ వార్షికోత్సం సందర్భంగా భక్తులు దేవాలయాన్ని రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పూలతో అలంకరించి నీలకంఠేశ్వరునికి మహా రుద్రాభిషేకం చేశారు. భాంజీ పంతులు రామారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజ, స్వామివారి నిర్మలాభిషేకం, 10.30 కి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12.30కి కల్యాణం, ఉమామహేశ్వరి గౌరి వత్రం చేపట్టారు

హల్విలో పిచ్చి కుక్క స్వైరవిహారం

కౌతాళం, ఫిబ్రవరి 12: హల్వి గ్రామంలో సోమవారం పిచ్చికుక్క దాడిలో గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు. వీరిలో ఓ చిన్నారి తీవ్రంగా గాయపడగా ఇద్దరు చిన్నారులు కొద్దిపాటి గాయాలకు గురయ్యారు. గ్రామస్థులు, చిన్నారుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చాకలి సంగీత(2) ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చి కుక్క అకస్మాత్తుగా దాడి చేసి ఫుర్రెబాగాన కొరికి తీవ్రంగా గాయపరిచింది. అక్కడే ఉన్న తల్లిదండ్రులు కుక్కబారి నుంచి బాలికను కాపాడగా అది అక్కడ నుంచి ముందుకు వెళ్లి అనూక్(7), శరణ బసవ(9) బాలలపై దాడి చేసి గాయపరిచింది. వెంటనే గ్రామస్థులు కర్రలతో పిచ్చి కుక్కను వెంటాడి కొట్టి చంపారు. చిన్నారులను రాత్రి కౌతాళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించి వ్యాక్సిన్‌లను వేశారు. అయితే సంగీత తీవ్రంగా గాయపడటంతో మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తరలించాలని వైద్యులు సూచించారు.

శశికళకు టీడీపీ టికెట్ ఇవ్వాలి

హొళగుంద, ఫిబ్రవరి 12: రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఆలూరు నియోజకవర్గం టీడీపీ టికెట్ మొలగవల్లి కురువ శశికళకు కేటాయించాలని కురువ సంఘం నాయకుడు మదాసి కురువ, మదారి కురువ పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జప్ప సోమవారం డిమాండ్ చేశారు. స్థానిక సాయిబన్న తాత దర్గాలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కురువ కులస్తులు 60వేలకు పైగా ఉన్నారని, పార్టీని గెలిపించడంలో కీలకపాత్ర కురువ కులస్తులదని అన్నారు. కార్యక్రమంలో మహేష్, ఎండీ హళ్లి రంగస్వామి, ముదటమాగి బీరప్ప, మార్లమడికి చంద్ర పాల్గొన్నారు.

మేమేమి చేశాం పాపం..

- ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన అధికారులు
- 46మందికి రిజిస్ట్రేషన్
- ముగ్గురికి పెండింగ్
- సబ్ కలెక్టర్‌ను కలిసిన బాధితులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 12 : 'మేమేమి పాపం చేశాం... మాకు జగనన్న కాలనీలో పట్టాలు ఇచ్చి... రిజిస్ట్రేషన్, జియో ట్యాగ్ చేసినా రెవెన్యూ అధికారులు మరో వ్యక్తికి పొజిషన్ పట్టా ఎలా ఇస్తారు' అంటూ ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం మండలం హాలహర్వి గ్రామ మహిళలు బుడ్డమ్మ, శేకమ్మ, రంజానమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని సర్వే నెం.407లో 117మందికి ఒకటిన్నర సెంటు చొప్పున ప్రభుత్వం ఏడాది క్రితం జగనన్న ఇంటి స్థలాలు కేటాయించి హద్దులు ఏర్పాటు చేసి పట్టాలు ఇచ్చి జియో ట్యాగింగ్ కూడా చేశారు. అందులో 49 మంది లబ్ధిదారుల స్థలాలను స్థానిక వైసీపీ నాయకులు కబ్జా చేశారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ బాధితులు నెలల తరబడి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా వారికి న్యాయం జరగలేదు. గత సోమవారం 5వ తేదీన బాధితులు ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మను కలిసి తమ గోడును చెప్పుకున్నారు. ఈ సంఘటనపై ఆంధ్రజ్యోతి పత్రికలో జగనన్న స్థలాల కబ్జా కథనం 6వ తేదీన ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. దిగివచ్చిన రెవెన్యూ అధికారులు రాత్రికి రాత్రే బాధితులను సచివాలయానికి పిలిపించి 46మందికి రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే ముగ్గురికి మాత్రం రిజిస్ట్రేషన్ చేయకుండా నిలిపేశారు.


సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న హాలహర్వి గ్రామస్థులు

కారణం అప్పటి తహసీల్దార్ నిత్యానంద రాజు ఈ ముగ్గురికి ఇచ్చిన 72, 73, 74 ప్లాట్లను అదే గ్రామానికి చెందిన జోమప్ప కొక్కడికే పొజిషన్ పట్టా ఇచ్చారు. దీంతో వ్యక్తి ఆ స్థలంలోకి లబ్ధిదారులను రానివ్వడం లేదు. దీంతో ఆ ముగ్గురు మహిళా లబ్ధిదారులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని కలిసి తమ గోడును విన్నవించారు. 49మందిలో 46మందికి రిజిస్ట్రేషన్ చేశారని, మేం ముగ్గురం మాత్రం ఏ పాపం చేశామని వాపోయారు. రెండు రోజుల్లో మీకు న్యాయం చేస్తామని, అలాగే త్వరలో 49మంది లబ్ధిదారులకు క్షేత్ర స్థాయిలో ప్లాట్లను అప్పజెబుతామని సిబ్బంది హామీ ఇచ్చారు.

టీడీపీతోనే గిరిజనుల అభివృద్ధి



లక్ష్మీ తండాలో మహిళలకు మేనిఫెస్టో వివరిస్తున్న కేఈ శ్యాంబాబు, శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న అమకతాడు గ్రామస్థులు

- గిరిజన గ్రామాల్లో కేఈ శ్యాంబాబు ప్రచారం
- టీడీపీలో చేరిన అమకతాడు గ్రామస్థులు

తుగ్గలి, ఫిబ్రవరి 12: టీడీపీతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్మీతండా, జాప్లాతండా, మిద్దెతండా, చిగుర్లగుట్ట తండాలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా కేఈ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎస్టీల అభివృద్ధి కోసం ఎస్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి గిరిజనులకు అన్ని రకాల రుణాలు అందించామని, అలాగే ప్రతి గిరిజన తండాకు బీటీ, సీసీ రోడ్లు వేయడంతో పాటు తాగునీటి సమస్య కూడా పరిష్కరించామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, గిరిజనులను నట్టేట ముంచారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపకపోతే బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కుంటు పడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, వెంకటస్వామి, చంద్రశేఖర్ యాదవ్, మీటూ నాయక్, జయరాముడు, రాజు నాయక్, హనుమంతు నాయక్, తిరుపాల్ నాయక్, రమేష్‌నాయక్, రాము నాయక్, సేవ్యా నాయక్, రూప్లా నాయక్, తిరుపాల్‌నాయుడు, శ్రీనివాసులు గౌడు, వెంకట్రాముడు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన అమకతాడు గ్రామస్థులు

పత్తికొండ/క్రిష్ణగిరి, ఫిబ్రవరి 12: పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని క్రిష్ణగిరి మండలం అమకతాడు గ్రామానికి చెందిన 80 కుటుంబాలు సోమవారం టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పత్తికొండ టీడీపీ కార్యాలయంలో కేఈ శ్యాంబాబు పార్టీ కండువా వేసి వారిని పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వాల్మీకి, దూదేకుల వర్గాలకు చెందిన నాయకులు మర్రి శ్రీరాములు, వీరభద్రుడు, గురుస్వామి, ఆంజనేయులు, వెంకటేశ్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో తమ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో వైసీపీ నాయకులు చిచ్చు పెడుతూ గొడవలు సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని యువ నాయకుడు శ్యాంబాబు నాయకత్వంలో టీడీపీలో చేరామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం పని చేస్తామని స్పష్టం చేశారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశ వ్యాప్తంగా తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండుటేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గ అధ్యక్షుడు వీరన్న అధ్యక్షత వహించారు. సీపీఐ, టీడీపీ, లోక్‌సత్తా, ప్రజాసంఘాల నాయకులు హాజరై ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామచంద్రయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరింపజేస్తూ దేశంలో మతోన్మాదాన్ని పెంపొందిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి బడా పారిశ్రామికవేత్తలకు ఈ దేశ సంపదను దోచి పెడుతుందని విమర్శించారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్, అటవీ సంపదలను, ఎల్ఐసీ, బ్యాంకులను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రాజాసాహేబ్, టీడీపీ నాయకులు లక్ష్మినారాయణ, అశోక్ కుమార్, సీపీఎం నాయకులు వెంకటేశ్వరరెడ్డి, లోక్‌సత్తా పార్టీ నాయకులు జయరాం, సీపీఐ నాయకులు నబీ రసూల్, రామాంజనేయులు, సుల్తాన్,గురుదాస్, కారన్న, ఉమాపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామచంద్రయ్య

ఆలూరులో రౌండ్‌టేబుల్ సమావేశం

ఆలూరు : ఆలూరు పట్టణంలో జ్యోతిబసు భవన్‌లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ అధ్యక్షతన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు భూపేష్, సీపీఎం మండల కార్యదర్శి షాకీర్ మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రవాణా రంగం దేశవ్యాప్తంగా బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ బంద్ జరుగుతుందన్నారు. ఈ బంద్‌కు అందరూ సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. రైతు సంఘ నాయకులు ఈరన్న, గోపాల్, ఏఐటీయూసీ నాయకులు శివ, మైన, గోవర్ధన్ పాల్గొన్నారు.

పరిహారం అందించాలి : సీపీఎం

తుగ్గలి, ఫిబ్రవరి 12: వర్షాభావ పరిస్థితులతో పంటలు చేతికందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరిహారం అందించకపోతే ఆందోళన చేస్తామని సీపీఎం నాయకులు శ్రీరాములు, కొండారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నష్టపరిహారం అందించాలని ధర్నా నిర్వహించారు. నష్టపోయిన ప్రతిరైతుకు ఎకరాకు రూ.10వేలు ఇన్‌పుట్ సబ్సిడీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద పంటల బీమా పరిహారం ఎకరాకు రూ.50వేలు, ప్రతి రైతుకు రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని కోరారు. సీపీఎం నాయకులు రంగరాజు, రంగస్వామి, రంగన్న పాల్గొన్నారు.

జాప్యమెందుకు..?

దేవనకొండ ,ఫిబ్రవరి 12 : ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు జిల్లాగా ప్రకటించినా పరిహారం పంపిణీ చేయడంలో జాప్యమెందుకని సీపీఎం, రైతుసంఘం నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, రైతుసంఘం అధ్వర్యంలో ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం రైతులపై కపటప్రేమ చుపుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, రైతుసంఘం నాయకులు శ్రీరాములు, అశోక్ ప్రభుత్వంపై మండిపడ్డారు.

ఎమ్మిగనూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీకేఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 22 మండలాలను, రాష్ట్రంలో 110 మండలాలను మాత్రమే కరువు మండలంగా ప్రకటించిందన్నారు. అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసి ఆదుకోవాలని కోరారు.


తుగ్గలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు

రైతులకు తక్షణమే సాయం చేయాలి

నందవరం : రైతులకు తక్షణమే సాయం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు దేవపుత్ర డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువుతో రైతులు పంటలు దెబ్బతిని నష్టపోయారని, నష్ట పరిహారం అందించడంలో కూడా పూర్తిగా విఫలమైయ్యిందని విమర్శించారు. తహసీల్దారు ఓబులేసుకు అందజేశారు.

స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించండి


స్పందనలో వచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న ఏవో శేషయ్య

ఆదోని, ఫిబ్రవరి 12: స్పందనలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా త్వర తగితిన పరిష్కరించాలని ఏవో శేషయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయా మండలాల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలాల నుంచి వచ్చిన సమస్యలు ఇలా

ఆదోని మండల కపటి గ్రామానికి చెందిన కల్యాణ బసవేశ్వర దేవాలయంలో ఫిబ్రవరి 8న హుండీలో కానుకల దొంగతనం జరిగింది. దొంగలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బసవేశ్వర దేవాలయం కమిటీ సభ్యులు శివ, శంకరయ్య తదితరులు అర్జీ సమర్పించారు.

కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చెందిన యేసయ్య తనకు చర్మకారుల పెన్షన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

ఈ కార్యక్రమంలో సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌పీవో శ్రీనివాసులు, హౌసింగ్ డీఈ రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఆర్డీవో నాగేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ, ఉప తహసీల్దారు కౌసార్ భాను, వలిబాషా పాల్గొన్నారు.

చందాలతో రోడ్డు వేసుకుంటే తవ్వేస్తారా..?


తవ్విన రోడ్డును చూపుతున్న కాలనీవాసి

మద్దికెర, జనవరి 12: ఎన్నో ఏళ్లుగా రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న మదనంతపురం గ్రామస్థులు చందాలు వేసుకొని మట్టిరోడ్డు వేసుకున్నారు. పరిశుభ్రంగా ఉంచుకున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికార పార్టీ నాయకులు సీసీ రోడ్లు వేస్తామంటూ నెల రోజుల క్రితం రోడ్డును తవ్వారు. ఇంత వరకు తికిగి రోడ్డు వేయకపోవడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కాలనీకి చెందిన ప్రసాద్, హనుమంతు మాట్లాడుతూ వైసీపీ నాయకులు 20 రోజుల క్రిందట రోడ్డు వేస్తామని తవ్వేశారు. ఇంత వరకు ఏ పనులు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీ వాసులం కలిసి చందాలు వేసుకుని రోడ్డు వేసుకుంటే.. కావాలని ఇలా తవ్వి పాడుచేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కె.శ్రీదేవి గ్రామానికి రోడ్డు వేయించకుండా ప్రచారానికి వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 12: పట్టణంలోని అశ్వథ లక్ష్మీనారాయణ దేవాలయంలో సోమవారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. ముందుగా గోపూజ, గంగపూజ, గణపతి పూజ, అంకురార్పన, అఖండ దీపారాధన, మైసూరు పీఠాధిపతులు సుబ్రమణ్య మహాస్వామి, నిరంజన్ గురుసిద్ధ దేవరు ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం మహాగణపతి, సతీసమేత ఆదిత్య, నవగ్రహ, నాగదేవత, శిఖర కళశాల ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఆలూరు సీటు సుజాతమ్మకే కేటాయించాలి

దేవనకొండ ,ఫిబ్రవరి 12: ఆలూరు టీడీపీ ఎమ్మెల్యే సీటు కోట్ల సుజాతమ్మకే కేటాయించాలని మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలంలోని కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గత ఎన్నికలలో ఓటమితో నిరాశ చెందకుండా ప్రతి కార్యకర్తలో ఉత్తేజం నింపి, పార్టీ ఒడిదుడుకులలో అండగా నిలిచిన సుజాతమ్మనే అధిష్ఠానం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. నాయకులు బడిగిజల రంగన్న, మలకన్న, రాజగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంఈవోగా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 12: ఆదోని ఇన్‌చార్జి మండల విద్యాశాఖ అధికారి-1గా ఆస్పరి ఎంఈవో రాజేంద్రప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జనవరి 31న ఎంఈవో శివరాములు పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఎంఈవోగా ప్రభుత్వం నియమించడంతో రాజేంద్రప్రసాద్ బాధ్యతలు తీసుకున్నారు. పాఠశాలల అభివృద్ధికి, నాడు-నేడు పనులు పూర్తి అయ్యేలా చూస్తామని తెలిపారు.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి


రథోత్సవం ముందు కళశాలతో మహిళలు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 12: పట్టణంలోని మార్కండేయ జయంతి సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, బిల్వార్చన, పూర్ణాహుతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పురవీధులలో స్వామివారి రథోత్సవాన్ని కోలాటాలు, మంగళవాయిద్యాలతో ఊరేగించారు. ఉదయం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, యువనాయకుడు జయమనోజ్ రెడ్డి, జనసేన నాయకుడు మల్లప్ప, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు రంగస్వామి, నాగరాజు, అంపయ్య, గోవిందరాజులు, రామాంజనేయులు, నరసింహులు, శ్రీనివాసులు, సత్యనారాయణ, మోహన్ పాల్గొన్నారు.

అప్రెంటీస్ విధానం అమలు చేయటం దుర్మార్గం

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 12: రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయ నియమాకప్రకియలో అప్రెంటీస్ విధానాన్నిప్రవేశపెట్టడం దుర్మార్గమని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు నాగమణి, జిల్లా నాయకులు దావీదులు అన్నారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశపెడుతూ విడుదల చేసిన జీఓ 56ను నిరసిస్తూ జీఓ కాపీలను నాయకులు దగ్ధం చేశారు.

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు

మద్దికెర, జనవరి 12: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని పత్తికొండ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కేసీ హరి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ బూత్ లెవల్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, మండల టీడీపీ కార్యదర్శి పెరవలి రామాంజులు, మాజీ ఎంపీటీసీలు సుధాకర్ చౌదరి, శివశంకర్, నర్ర సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ

మంత్రాలయం, ఫిబ్రవరి 12: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో సీఐ ఎరిషావలి, ఎస్ఐ కిరణ్‌బాబు ఆధ్వర్యంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రౌడీషీటర్లు అల్లర్లు గతంలో కేసులో నమోదైన వ్యక్తులపై నిఘా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, ఫిబ్రవరి 12: మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ పి.రాజేంద్ర సోమవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. ఈయనకు తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర, శశిశేఖర్‌రావు, వీఆర్వో భీమన్నగౌడు, మఠం అధికారులు బిందుమాదవ్ ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం రాత్రి బస చేసి మంగళవారం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని పీఠాధిపతి ఆశిస్సులు పొందనున్నారు.

కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలను గద్దె దింపండి

మంత్రాలయం, ఫిబ్రవరి 12: కార్మికులను కట్టుబానిసలుగా చేసిన మోదీ, జగన్ ప్రభుత్వాలను గద్దె దింపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు అన్నారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సీఐటీయూ మండల నాయకులు ప్రాణేష్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జయరాజు, అంగన్‌వాడీ అధ్యక్షురాలు విశాలాక్షి, భీమేశ్వరి, ప్రమీలమ్మ, ఆశా యూనియన్ అధ్యక్షురాలు పుష్పలత, నాగన్న పాల్గొన్నారు.

● **సీఐటీయూ నూతన మండల కమిటీ ఎన్నిక**

మంత్రాలయం మండలం సీఐటీయూ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు తెలిపారు. మండల కన్వీనర్‌గా భీమేశ్వరి, కోకన్వీనర్‌గా ప్రాణేష్, పుష్పలతలను ఎన్నుకున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులుగా నాగన్న, లక్ష్మన్న, రఘు, విశాలాక్షి, కమలమ్మ, కళ్యాణి, శ్వేత, రాధ, పెద్దయ్య, దేవేంద్ర, ప్రసంగిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 12: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా జీవోను విడుదల చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు యల్లప్ప, పౌలురాజు, ముక్తర్, శివ లు డిమాండ్ చేశారు. సోమవారం తెల్లవారు జామున సమావేశమయ్యారు. నల్లబ్యాడ్జీలను ధరించి కార్మికులు పనులకు హాజరయ్యారు.